మహా నిర్లక్ష్యం.. ఇదిగో సాక్ష్యం



కమ్యూనిటీ భవనంలోని గ్రంథాయంలో కూలిన శ్లాబ్

- దీన స్థితిలో గూడెం గ్రంథాలయం
- సొంత భవనం లేక మూతబడిన తీరు
- పాడైన విలువైన పుస్తకాలు
- శిథిలావస్థలో కమ్యూనిటీ భవనం



గ్రంథాలయంలో చెల్లాచెదురుగా పాడైన పుస్తకాలు, పత్రికలు, సామగ్రి

గూడెంకొత్తవీధి: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలనేది నిజం.. ఇక్కడ అందుబాటులో ఉన్న విలువైన పుస్తకాలతో విజ్ఞానం పొందవచ్చనేది అక్షర సత్యం.. ఏళ్ల తరబడి గ్రంథాలయాల భవనాలు కనీసం మరమ్మతుకు నోచుకోలేదు..అయితే గత వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రంథాలయాలకు మహర్దశ కలిగింది. దశాబ్దాలుగా శిథిలదశలో ఉన్న భవనాలు తొలగించిన కొత్త నిర్మాణాలు చేపట్టడంతో పాటు పలు భవనాలకు మరమ్మతు పనులు చేపట్టారు. ఇందులో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేశారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో చాలా ప్రాంతాల్లో గ్రంథాలయాల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామాల అభ్యున్నతిపై కనీసం దృష్టి సారించలేదు. ఇప్పటికీ ఆరు నెలలైనా మన్యంలో ఏ విధమైన అభివృద్ధి పనులు చేయలేదు. ఇందులో భాగంగా గ్రంథాలయ భవనాల మరమ్మతు, కొత్త నిర్మాణాలపై కనీసం దృష్టి సారించలేదు. పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని యంత్రాంగం

సాధారణంగా ఏ మండల కేంద్రంలో నైనా కనీసం గ్రంథాయలం ఉండి తీరుతుంది. కానీ గూడెంకొత్తవీధిలో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇక్కడ గ్రంథాలయమే లేకుండా పోయింది. వివరాల్లోకి వెళితే గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో మొదటి నుంచి గ్రంథాలయానికి సొంత భవనం లేదు. పూర్తిస్థాయి లైబ్రేరియన్ కూడా లేరు. కొన్నాళ్లు ఒక గదిలో మరికొన్నాళ్లు సామాజిక భవనంలో ఇది కొనసాగింది. మండల కేంద్రంలోని సామాజిక భవనంలోని ఒక గదిలో నిర్వహించే వారు. వర్షాలకు ఈ భవనం స్లాబ్ దెబ్బతినడంతో అందులోని పుస్తకాలు, పత్రికలన్నీ పూర్తిగా పాడయ్యాయి. సామగ్రి ధ్వంసమైంది. ఇక దీన్ని తాత్కాలికంగా కొద్ది రోజులు తహసీల్దారు కార్యాలయం వెనుక ఉపాధ్యాయుల నివాస గృహాల్లో నిర్వహించారు. గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సచివాలయాలతో పాటు డిజిటల్ గ్రంథాలయ భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టారు. నిధుల విడుదలైనా అధికారుల నిర్లక్ష్యంతో నిర్మాణం చేపట్టలేదు. దీంతో ఆ నిధులు వెనక్కి మళ్లాయి. దీంతో ఈ గ్రంథాలయానికి పూర్తిగా గ్రహణం పట్టింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ పాలనలో తాత్కాలికంగా నైనా ఏదో ఒక ప్రభుత్వ భవనంలో గ్రంథాలయాన్ని నెలకొల్పే ప్రయత్నం అధికారులెవరూ చేయడం లేదు. దీంతో చేసేది లేక గూడెంకొత్తవీధి మండలానికి కేటాయించిన పుస్తకాలు, విలువైన పత్రికలను, తాత్కాలికంగా చింతపల్లి తరలించారు. దీంతో ప్రస్తుతం గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు చదువుకుందామన్నా కనీసం గ్రంథాలయం లేని పరిస్థితి ఎదురైంది. అధికారులు ఇప్పటికైనా తాత్కాలిక భవనంలోనైనా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు, యువకులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలంటే విలువైన పుస్తకాలు అవసరం. ఎక్కువ ధరలతో కూడి ఉన్న పోటీ పరీక్ష పుస్తకాలు, ఇతర పత్రికలను ఖర్చు పెట్టి కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత నా లాంటి గిరిజన యువతకు లేదు. మండల కేంద్రంలో గ్రంథాలయం లేక యువత ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి లైబ్రరీ అందుబాటులోకి తీసుకురావాలి.

– పూజారి లీలాప్రసాద్ గూడెంకొత్తవీధి

భవనం కోసం ప్రతిపాదించాం

గతంలో గ్రంథాలయం నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు రూ.3.50లక్షలు వెనక్కి వెళ్లాయి. గ్రంథాలయం భవనానికి స్థల సేకరణ కూడా చేయలేదు. గ్రంథాలయం భవన నిర్మాణం కోసం ప్రతిపాదించాం. ఇక్కడున్న విలువైన పుస్తకాలను భద్రపరిచే అవకాశం లేకే తాత్కాలికంగా చింతపల్లి గ్రంథాలయానికి తరలించాం. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనం ఏదైనా కేటాయిస్తే అందులో తాత్కాలికంగా గ్రంథాలయాన్ని కొనసాగిస్తాం.

– సూర్యనారాయణ.
ఇన్‌చార్జి లైబ్రేరియన్, చింతపల్లి

క్లుప్తంగా

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పెదబాలన్న

జి.మాడుగుల: మండలంలో కోరాపల్లి పంచాయతీ మారుమూల గ్రామాలకు 15వ ఆర్థిక సంఘం నిధులతో మట్టి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు సర్పంచ్ మసాడి రాజులమ్మ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు పెదబాలన్న తెలిపారు. కోరాపల్లి పంచాయతీ సుర్తిపల్లి గ్రామంలో మట్టి రోడ్డు నిర్మాణ పనులు వారు ప్రారంభించారు. ఉప సర్పంచ్ చంద్రమోహన్, వార్డు సభ్యులు చిన్నయ్యపడాల్ కృష్ణాచారి, మాజీ సర్పంచ్ రామ్మూర్తినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు వరహాలనాయుడు, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

24న పీసా గ్రామసభలు



డీఎల్‌పీవో కుమార్

పాడేరు రూరల్: పంచాయతీ కేంద్రాల్లో పీసా ఈనెల 24న గ్రామసభలు నిర్వహించనున్నట్టు డీఎల్‌పీవో పి.ఎస్.కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతాల్లో నివసించే ప్రజల కోసం గ్రామ సభల ద్వారా స్వయం పాలనను నిర్ధారించుకునేందుకు పీసా చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. ప్రతి పంచాయతీలో వేడుకలు నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.10వేలు మంజూరు చేస్తుందనానరు. ఈ మేరకు సర్పంచ్, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సమన్వయంగా పనిచేసి, వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

రంపచోడవరం : సమస్యలు పరిష్కారం కోసం వెలుగు యానిమేటర్ల రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి మూడవ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ అధికారులు లేకపోయినా వెలుగు యానిమేటర్లు టెంట్ వద్దనే కూర్చొని దీక్షలు చేశారు. ఇప్పటికైనా వెలుగు ఏపీడీ స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని వెలుగు యానిమేటర్లు హెచ్చరించారు.


మాలధారుల ఇరుముడులు



పూజలు చేస్తున్న మాలధారులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని దుర్గమ్మ తల్లి ఆలయంలో భవానీ మాలధారుల ఇరుముడులు కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీక్షపూర్తి చేసుకున్న మాలధారులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురుస్వాములు లక్ష్మణరావు, నగేష్‌లు భవానీ మాలధారులకు ఇరుముడి కట్టారు. భవానీలు, వారి కటుంబ సభ్యుల జై భవానీ.. జైజై భవానీ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కుమడ పంచాయతీ కేంద్రంలో సైతం భవానీల దీక్షల విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం 54 మంది భవానీ మాలధారులు ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు పయనమయ్యారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



బోరు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య పడాల్

చింతపల్లి: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పడాల్ చెప్పారు. మండలంలోని ఎర్రబొమ్మలు పంచాయతీ పరిధిలోని కొండవంచుల గ్రామంలో జెడ్పీ నిధులతో బోరు బావి నిర్మాణ పనులను వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి జిల్లా పరిషత్ నిధులతో 16 బోర్లు , మండల పరిషత్ నిధుల నుంచి మరో 10 బోర్లు నిర్మాణం చేపడుతున్నట్ట తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజా రమేష్‌కు అభినందనలు



రాజారమేష్‌ను సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, నాయకులు

అరకులోయటౌన్: అరకులోయ మండలంలోని మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా పనిచేస్తున్న కిల్లో రాజ రమేష్ బోస్ వైఎస్సార్‌సీపీ మేధావుల వర్గం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి అరకు నియోజకవర్గం పరిధిలో అనేక మందికి జిల్లా స్థాయిలో పార్టీ పదవులు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. నియోజవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. పార్టీ మేధావుల వర్గం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రాజారమేష్ బోస్ మాట్లాడుతూ గతంలో మార్కెట్ యార్డ్ కమిటీచైర్మన్‌గా ఉంటూ పార్టీకి, ప్రజలకు సేవలందించానని, ప్రస్తుతం నాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా విని యోగించి పార్టీ కోసం పనిచేస్తానన్నారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం నర్సింగరావు, మండల పార్టీ అధ్యక్షుడు లొక్కొయి లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు శత్రుఘ్న తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు



నారాయణగిరి ఆలయంలో స్వామివారు

రంపచోడవరం : మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జనవరి 10న ఉదయం 3 గంటలకు వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్టు ద్వారకా తిరుమల ఆలయ ఈవో వెంకట సత్యనారాయణమూర్తి, ఆలయ చైర్మన్ సుధాకర్, ఆలయ అర్చకులు వేంకటేశ్వరరావు ప్రకటించారు . అధిక సంఖ్యలో భక్తులు పాల్గొవాలని రంపచోడవరం ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లమిల్లి వెంకట రామారెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘం అధ్యక్షులకు సన్మానం



వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘం అధ్యక్షులను సన్మానిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్యపడాల్ తదితరులు

చింతపల్లి: వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పడాల్ అన్నారు. మండల కేంద్రంలో ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులుగా నియమించిన జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిందాడ అప్పారావు, సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు, లంబసింగి మాజీ సర్పంచ్ కొర్రా రఘునాథ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం చేయాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, ఎంపీటీసీ సభ్యులు దారలక్ష్మి, జయలక్ష్మి, సర్పంచ్ దురియా పుష్పలత, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పాడేరు రూరల్: ఆదివాసీ మాతృభాష రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా సవర ఆనందరావు (సీతంపేట), ప్రధాన కార్యదర్శిగా మర్రి చిట్టిబాబు(పాడేరు), ఉపాధ్యక్షులుగా పాంగి శ్రీను, కుంజ నవీన్, సవర డొంబు, సీదరి సత్తిబాబు, పాంగి కుమారి, కుసుమకుమారి, వెంకటేష్, గౌరి, కుంబిడి రమేష్, సీదరి జగన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో 19 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మాతృభాష వలంటీర్ల సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

ప్రపంచ గణిత మేధావి రామానుజన్



అరకులోయ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది



ముంచంగిపుట్టులో రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



చింతూరు కళాశాలలో రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పాడేరు రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చిట్టి అబ్బాయి ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చిట్టి అబ్బాయి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ రూపొందించిన సమీకరణాలతో ప్రపంచ మేధావిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. విద్యార్థులంతా రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని మంచి నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. సమాజ మార్పునకు విద్యార్థులదే తొలి మెట్టు అన్నారు. విద్యదశలోనే క్రమశిక్షణ అలవర్చుకోని ఉన్నత విద్యావంతులుగా మారాల న్నారు. లక్ష్యంతో ముందుకు పోవాలని విద్యార్థులను కోరారు. ఇందులో భాగంగా నిర్వహించి వివిద పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రసూల్, అధ్యాపకులు కోటేశ్వరరావు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణితశాస్త్ర దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణితంలో అసాధారణ ప్రతిభ చూసిన విద్యార్థిగా రామానుజన్ గుర్తింపు పొందారని, గణిత శాస్త్రంలో 3900 కంటే ఎక్కువ సమీకరణాలను సమీకరించారని, ఎన్నో పుస్తకాలను రచించారన్నారు. గణితంలో అపర మేధావిగా పేరొందిన రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు గణితం పట్ల పట్టు సాధించాలని ప్రిన్సిపాల్ మత్స్యరాజు అన్నారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం శ్రీనివాస రామానుజన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ గణితశాస్త్రంలో అనేక ఆసక్తికరమైన అంశాలను ఆవిష్కరించి ప్రపంచ మేధావిగా రామానుజన్ గుర్తింపు పొందారని తెలిపారు. అధ్యాపకులు శ్రీలక్ష్మి, వెంకటరావు, నాగేశ్వరరావు, అప్పనమ్మ, శ్రీనివాసరావు, శైలజ, పద్మ, హారతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దదేవుడు ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ వాసుల ఇలవేల్పు పెద్దదేవుడు పండుగ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహించనున్న ట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పలు సంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ వెంకటరావు, వైస్ సర్పంచ్ జగ్గునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు గురు. గీత, స్వామి, సుబ్బారావు, కోటేశ్వరావు, సింహాద్రి మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హుకుంపేటలోని సమావేశంలో సహచర విద్యార్థులతో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

హుకుంపేట: పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి **చేరుకుంటామని అరుకు ఎమ్మెల్యే** రేగం మత్స్యలింగం **అన్నారు. స్థానిక ప్రభుత్వ** ఆశ్రమ ఉన్నత బాలుర **పాఠశాల–1లో గురు శిష్యు**ల ఆత్మీయ సమ్మేళనం **ఆదివారం నిర్వహించారు.** కార్యక్రమంలో అరకు **ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పా**ల్గొన్నారు. ఈ సందర్భం **గా పాఠశాలలో ఆయనకు** విద్య అభ్యసించిన గురు**వులు, పూర్వ విద్యార్థులు** తదితరులు ఎమ్మెల్యే **మత్స్యలింగంను ఘనంగా** స్వాగతం పలికారు. చిన్ననాటి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకొరికొకరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమతో పాటు విద్యాభ్యాసం చేసి ఎమ్మెల్యేగా ఉండడం గొప్ప విషయమని తోటి పూర్వ విద్యార్థులు కొనియాడరు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న తనంలో తనతో పాటు చదివిన వారందరు ఉపాధ్యాయులు, తదితర ఉన్నత స్థానంలో ఉండడం చాలా సంతోషకరమన్నారు. ఆయనతో పాటు పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



కూనవరంలో మాట్లాడుతున్న నాయకులు

కూనవరం: వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండాలని వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీపీ పాయం రంగమ్మ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆవుల మరియాదాస్, మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పాత బస్‌స్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరునెలలు గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో గుణపాఠం చెబుతారన్నారు. నాయకులు డి.గంధాధర్‌రావు, ఎ.వెంకట్రామారావు, భరతమూర్తి, కె.మోహన్‌రావు, కె.సునీత, లక్ష్మణరావు, ఎం.పూర్ణ, బి.వెంకటేష్, జి.రమేష్, సర్పంచ్‌లు అభిరామ్, కట్టం లక్ష్మి, నిరోషా, వెంకన్నబాబు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా నూర్పిళ్లు



ఎం.హట్టగుడలో వరి నూర్పిళ్లు

అరకులోయటౌన్: మండలంలోని వరి నూర్పిళ్ల పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో గిరి రైతులు ఆందోళనకు గురయ్యారు. ప్రస్తుతం వర్షాలు తగ్గి, ఎండ కాస్తుండడంతో గత కొన్ని రోజులుగా కల్లాల్లో కుప్పలు వేసి, టార్పాలిన్‌లు, వరి గడ్డి కప్పి భద్రపరిచిన వరి నూర్పిడి చేస్తూ, ధాన్యాన్ని ఇంటికి తరలిస్తున్నారు. అరకులోయ ప్రాంతంలోని గిరిరైతులు ఒడిశా, వడ్డాది మాడుగుల, చోడవరం ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన వరి నూర్పిడి మిషన్‌లు ఉపయోగించి, అతి తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో వరి నూర్పిడి పనులు చేయించుకుంటున్నామన్నారు. వరి పంట కోత కోసి పొలాల్లోనే వదిలిన వరి పన్నాలను గట్టుకు చేర్చి ఎండ బెడుతున్నారు. అదే విధంగా వరి కోత పనుల్లో గిరి రైతులు నిమగ్నమయ్యారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గిరిరైతులు ఆనందంగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు



అరకులోయ సీడీపీవో శారద



అడ్డతీగల సీడీపీవో సుధ

అరకులోయటౌన్/డుంబ్రిగుడ/ముంచంగిపుట్టు/హుకుంపేట/గూడెంకొత్తవీధి/చింతపల్లి/జి.మాడుగుల/కొయ్యూరు/రాజవొమ్మంగి/అడ్డతీగల/ వై.రామవరం/గంగవరం/మారేడుమిల్లి: అల్లూరి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవోలు తెలిపారు. ఇందులో భాగంగా ఆయా(హెల్పర్) పోస్టుకు మహిళ అభ్యర్థులు పదోవ తరగతి ఉత్తీర్ణుల ఉండాలని, స్థానికంగా నివాసం ఉండి, వివాహితులై ఉండాలన్నారు. 2024 జూలై 1వ తేది నాటికి 21 సంవత్సరాలు పూర్తి చేసి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత ఉన్న మహిళ అభ్యర్థులు ఈ నెల 31వ తేది సాయంత్రం 5గంటల కల్లా ఐసీడీఎస్ సీడీపీవో కార్యలయానికి నేరుగా లేదా పోస్టు ద్వారా దరఖాస్తులను అందించాలని సూచించారు. అర్హత, మార్కుల ఆధారంగానే ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మండలాల్లో ఖాళీలు ఇవీ...

ఈ మేరకు అరకులోయలోని మాదల పంచాయతీ కమలతోట, లోతేరు పంచాయతీ తోటవలస, లండిగుడ, పద్మాపురం పంచాయతీ బొండాంగుడ గ్రామాల్లో ఆయా పోస్టులు ఖాళీ ఉన్నట్టు సీడీపీవో శారద తెలిపారు. డుంబ్రిగుడ మండలంలోని సాగర పంచాయతీ బలియగుడ, కొర్రాయి పంచాయతీ సాయినగర్, గసభ పంచాయతీ కూడ, తూటంగి పంచాయతీ బుడ్డింగి, సొవ్వా పంచాయతీ కాగువలసలో ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో నీలిమ తెలిపారు. ముంచంగిపుట్టు మండలంలో రాకాసిరాయి లేదా తలబిరడ, వరండాపుట్టు, ఏడుకొండలబంధ, పోలిపుట్టు, టిక్రపడ, బంగారుపల్లి, మల్లిపాదర్ లేదా వల్లెబీరు, టొంగికోట గ్రామాల్లో ఆయా పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో వరహాలమ్మ కోరారు. హుకుంపేట మండలంలోని చీకుమద్దుల పంచాయతీ కారేగరువు, పాతకోట పంచాయతీ ఎగరూడి, తడిగిరి పంచాయతీ ఏ.బొడ్డాపుట్టులో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో బాలచంద్రమణిదేవి తెలిపారు. గూడెంకొత్తవీధి మండలంలోని అరటిచెట్లవీధి, డి.కొత్తూరు, బొర్రమామిడి, పిల్లిగొంది, ఈదలబంద, కొత్తపల్లి, తీములగుంట, నూతలు, మాలిగూడ టంగుళ్లగొంది గ్రామాల్లో ఆయా పోస్టుల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని సీడీపీఎ లక్ష్మీదేవి సూచించారు. చింతపల్లి మండలంలో కొత్తపాలెం పంచాయతీ దేగలపాలెం, చౌడుపల్లిలో సామరవీధి, పెదబరడ పంచాయతీలో పెదగొంది, కుదుముసారి పంచాయతీలో రాళ్లగెడ్డకొత్తూరు, గొప్పుగుడిసెలు, జడుగూరు, బలపం పంచాయతీలో సుర్తిపల్లి, కొత్తపాలెం పంచాయతీలో పినపాడు గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో రమణి కోరారు. జి.మాడుగుల మండలంలో పెదవలస, గెమ్మెలిబారు, చింతలపాడు, బంగారుబూడి, కర్లపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ ఉన్న ఆయా పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సువర్ణమ్మ తెలిపారు. కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ దవడగొయ్యి, రాజులపాడు ఆడాకుల పంచాయతీ డి.కొత్తూరు, రాజేంద్రపాలెంలో జోగంపేట, కేంద్రాల్లోని ఆయాల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీవో విజయకుమారి చెప్పారు. రాజవొమ్మంగి మండలంలోని బొడ్డగొంది, లోతావారివీధిల్లో ఖాళీ ఉన్న ఆయా పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. అడ్డతీగల మండలంలో వెంకటనగరం, చిక్కాపుగడ్డ, మాకవరం, రేగడివీధి, పెనికెలపాడు, తియ్యామామిడి, రోళ్ళగడ్డ కేంద్రాల్లో ఖాళీ ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో వై.సుధ కోరారు. వై.రామవరం మండలంలో పసరుగిన్నె, సింహాద్రిపాలెం, సింగవరం, మునగలపూడి, కోకితగొంది, బొడ్డపల్లి, కొమరవరం, గొరబంద, పైడిపుట్ట గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. గంగవరం మండలంలో చిన అడ్డపల్లి (అడ్డపల్లి చిన్నవీధి), శరభవరం గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో లక్ష్మి కోరారు. మారేడుమిల్లి మండలంలోని మల్లవరం, నీలవరం, బందపాటివీధి, మునూరు, ఈ కొత్తవీది, కొత్తవలస, ముందమామిడి, పుట్టగండి, బీముని గడ్డ, రత్సవలస ,పాముగొంది, కొత్తూరు, చింతకొయ్య, నాగలోవ, చలమటి పాకలు, కొత్తపాకలు, జాజివలస అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ ఉన్న ఆయా పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరారు.

స్వీట్‌కార్న్‌కు గిరాకీ



రాజవొమ్మంగి వారపు సంతలో స్వీట్ కార్న్ అమ్మకాలు

రాజవొమ్మంగి: కేవలం పట్టణ ప్రాంతాల్లో, పర్యాటక స్థలాల్లో కనిపించే స్వీట్ కార్న్ (తీపి మొక్కజొన్న పొత్తులు) ఇప్పుడు మన్యంలోని వారపు సంతల్లో కూడా దర్శనమిస్తున్నాయి. మండలంలోని జడ్డంగి, రాజవొమ్మంగి వారపు సంతల్లో శని, ఆదివారాల్లో స్వీట్‌కార్న్ విరివిగా అమ్ముడయ్యాయి. సాధారణంగా ఈ ప్రాంతంలో నాటు మొక్కజొన్న పొత్తులు(దేశవాళీ) వినియోగం ఉంది. అయితే మెత్తగా, తీయగా ఉండే ఈ స్వీట్‌కార్న్‌పై కూడా గిరిజనులు మక్కువ చూపుతున్నారు. కాట్రావులపల్లి నుంచి వ్యాపారులు రాజవొమ్మంగి, జడ్డంగి ప్రాంతాలకు మోటారు సైకిళ్లు, ఆటోలపై తెచ్చి అమ్ముతున్నారు. వంద పచ్చి పొత్తుల హోల్‌సేల్ ధర రూ.1400 కాగా, ఉడకబెట్టిన ఒక పొత్తు రూ.20లకు విక్రయిస్తున్నారు. కాగా అధిక పోషకాలు ఉన్న వాటిలో తియ్యగా వుండే స్వీట్‌కార్న్ ఒకటి. వీటిని ఉడకబెట్టి తింటారు. వీటిలో కేలరీలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. స్వీట్‌కార్న్‌తో రకరకాల వంటలు కూడా చేస్తారన్న విషయం తెలిసిందే. స్వీట్‌కార్న్‌కు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది.